క్లుప్తంగా

నీ ఓటు... నీ భవిష్యత్‌పై అవగాహన



జి.సిగడాం: మానవహారం నిర్వహిస్తున్న మహిళా సంఘాల సభ్యులు

జి.సిగడాం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రంలో ఏపీ రవికుమార్, ఐకేపీ ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఓటింగ్‌పై అవగాహన కల్పించారు. ప్రతీ బూత్‌లో 85 శాతం పోలింగ్ అయ్యేలా కృషి చేయాలని ఓటర్లను కోరారు. అనంతరం మానవహారం చేపట్టారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వాన ప్రమీల, సిబ్బంది ఉన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం శ్రీకాకుళం క్యాంపస్ విద్యార్థులు పిలుపునిచ్చారు. ఎస్ఎంపురంలో కళాశాలకు చెందిన జాతీయ సేవా పథకం యూనిట్-1 ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నారు. ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శనివారం మొక్కలు నాటారు. పారిశుద్ధ్యం, పచ్చదనంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ పీఓలు సింహాచలం, ఈశ్వరరావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోతయ్యవలసలో పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కొండలరావు

ఎచ్చెర్ల: గ్రామాల్లో ఏర్పాటు చేసిన బూత్ లెవెల్ స్థాయి సిబ్బంది ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించాలని లావేరు ఎంపీడీఓ కొండలరావు సూచించారు. లావేరు మండలంలోని పోతయ్యవలస, గోవిందపురం, ఇజ్జాడపాలెం, బరిణికాం, పెద్దకొత్తకోట, చిన్నకొత్తకోట గ్రామాల్లోని పలు పోలింగ్ స్టేషన్లను శనివారం తనిఖీ చేసి అక్కడి సిబ్బంది మాట్లాడారు. సిబ్బంది ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రతీరోజు హాజరు తప్పనిసరిగా చేపట్టాలన్నారు. విధులకు డుమ్మా కొట్టిన అధికారులపై చర్యలు తప్పవన్నారు. సీనియర్ అసిస్టెంట్ మాధవరావు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

బూరవెల్లిలో ఓటరు అవగాహన ర్యాలీ



ఓటుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గార: మండల మహిళా సమాఖ్య సభ్యులు బూరవెల్లి, బోరవానిపేట గ్రామాల్లో శనివారం ఓటర్లకు అవగాహన ర్యాలీ, సమావేశం నిర్వహించారు. ఏపీ కొండలరావు, ఏపీఎం భాగ్యలతలు మాట్లాడుతూ.. ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఐదేళ్లపాటు మంచి ప్రభుత్వం ఏర్పడేందుకు ఓటు కీలకమవుతుందన్నారు. ఓటు వినియోగంపై సోషల్ మీడియా ద్వారా అవగాహన పొందవచ్చన్నారు. ఓటు హక్కు- మన జన్మ హక్కు, ఓటును నిర్భయంగా వేయండి, మంచి ప్రభుత్వం రావాలంటే ప్రలోభాలకు లొంగకండి వంటి ప్లకార్డులను ప్రదర్శించారు.

క్రైస్తవ సంఘాల అభ్యున్నతికి కృషి



సమావేశంలో పాల్గొన్న పాస్టర్లు

రణస్థలం: క్రైస్తవ సంఘాల అభ్యున్నతికి ప్రతీ ఒక్క పాస్టర్ కృషి చేయాలని జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు డి.ఎస్.వి.ఎస్.కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని డబ్ల్యుఎంఈ చర్చ్ ఆవరణంలో ఎచ్చెర్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల పాస్టర్స్ సహవాస కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా కందుకూరి ఆమోస్, కార్యదర్శిగా గర్భాపు ఆల్ఫోన్స్, కోశాధికారిగా అండలూరి ఏలియా, కన్వీనర్‌గా సి.హెచ్.సుధాకర్‌ను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నాలుగు మండలాల పాస్టర్లు పాల్గొన్నారు.

నీటి వెతలకు చెక్

- వేసవిలో కూడా రెండు పూటలా నీటి సరఫరా
- రూ 5.60 కోట్లతో పంపుహౌస్, గ్యాలరీ నిర్మాణం
- మంత్రి ధర్మాన చొరవతో నీటి సమస్య పరిష్కారం



బలగ వాటర్ వర్క్స్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరంలో అధికంగా నివసించేది సామాన్య, మధ్య తరగతి కుటుంబాల వారే. వీరిలో చాలామంది మంచినీటి కోసం ఇబ్బంది పడే రోజులు చాలా ఉన్నాయి. ఇటువంటి తరుణంలో గత కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ధర్మాన ప్రసాదరావు నగరంలో మంచి నీటి సమస్య లేకుండా చేయాలని భావించారు. అప్పటి కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి ద్వారా ప్రత్యేక నిధులను రప్పించారు. ఈ నిధులతో కుళాయిల ద్వారా మంచినీటిని ఇంటింటికీ అందించడం ప్రారంభించారు. అయితే ఆ తరువాత వచ్చిన ప్రభుత్వాలు నగరవాసుల తాగునీటి సమస్యలను పెద్దగా పట్టించుకోలేదు. టీడీపీ హయాంలో ఉచితంగా కుళాయి కనెక్షన్లు పేరుతో వీధివీధికి బ్లూకలర్ పైపులు వేసి ఆ తరువాత డబ్బులు వసూలుచేసి లైన్లు వేసి అలా వదిలేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రిగా ధర్మాన ప్రసాదరావు చిక్కోలు నగరవాసులు మంచినీటికి ఇబ్బంది లేకుండా చేయాలన్న దృఢ సంకల్పంతో రూ 3.29 కోట్లు నిధులు మంజూరు చేశారు. అంతకు ముందు ఒక్కపూటే మంచి నీరు వచ్చిన ప్రాంతాలన్నింటికీ మండు వేసవిలో సైతం రెండు పూటలా నీరు అందించేందుకు శరవేగంగా పనులు పూర్తిచేశారు. ఈ పనుల్లో భాగంగా బలగ వద్ద అదనపు పంపుహౌస్ రూ 1.82 కోట్లు, గ్యాలరీ (నీటిని సేకరించి ఫిల్టర్‌చేసే) దానికి రూ 1.47 కోట్లుతో పనులు పూర్తిచేసి విలీన పంచాయతీలతో కలుపుకొని రెండు పూటలా పుష్కలంగా తాగు నీటిని అందిస్తున్నారు. అంతేకాకుండా పాత్రునివలస, సీపన్నాయుడుపేటలతో పాటు పలు ప్రాంతాల్లో కొత్తగా పైపులైన్లు వేసి నీటి సరఫరా చేసేందుకు రూ 2.31 కోట్లు ఖర్చు చేసినట్లు కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. శ్రీకాకుళం నగర ప్రజలకు రెండు పూటలా అవసరాలకు 18.82 ఎమ్ఎల్‌డీ (18.82 కోట్ల లీటర్లు) నీటిని పైపులైన్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. అంతేకాకుండా పైపులైన్లు లేని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా 0.65 ఎమ్ఎల్‌డీ లీటర్లు అందిస్తున్నారు. నగర ప్రజలకు అవసరాలకు మించి 20.4 ఎమ్ఎల్‌డీ (20.4 కోట్లు లీటర్లు) అందుబాటులోకి తీసుకురాగలిగారు. ఇటీవల కాలంలో బలగ వాటర్ వర్క్స్ పనులు పూర్తవ్వడంతో పుష్కలంగా నీరు అందించగలుగుతున్నారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు నగరవాసులకు మౌలిక సదుపాయాలు అందించాలన్న ఆలోచనతో ఉండడం వల్లే ఇవన్నీ సాధ్యపడుతున్నాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పైపులైన్లు వేస్తున్న దృశ్యం

పేద ప్రజల అవసరాలు తీరుస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా ఉంటామని బహిరంగంగా చెబుతున్నారు. పెద్దపాడు, పాత్రునివలస, ధర్మశాస్తనగర్‌లతో పాటు పలు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో మంచినీటి సౌకర్యం కల్పించేందుకుగా రూ. 23.04 కోట్లుతో ప్రతిపాదనలు పంపించారు.

రెండు పూటలా నీరు ఇస్తున్నారు



గతంలో వీధికో కుళాయి ఉండేది. అక్కడే బిందెలు పట్టుకుని గంటల కొద్ది నిలబడినా మంచి నీరు దొరికే పరిస్థితి ఉండేదికాదు. వేసవి వస్తే మరీ భయం వేసేది. నీళ్లు దొరుకుతాయా లేదా అనే ఆందోళన ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు ప్రతి ఇంటి వద్ద ఒక కుళాయి ఏర్పాటు చేశారు. రెండుపూటలా నీటిని సరఫరా చేస్తుండడంతో ఇబ్బందులు తప్పాయి. మంత్రి ధర్మాన ప్రసాదరావు వల్లే మంచినీటి కష్టాలు తీరాయి.

– బత్తిలి స్వప్న, రాయివీధి, 21వ డివిజన్, శ్రీకాకుళం

భగత్‌సింగ్‌కు నివాళులు



రణస్థలం: భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ ఆవరణలో భగత్‌సింగ్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. స్వాతంత్య్ర పోరాటం కోసం 23 ఏళ్లకే ప్రాణాలు త్యాగం చేసిన గొప్పవ్యక్తిని వక్తలు కొనియాడారు.

ఎచ్చెర్లలో..

ఎచ్చెర్ల: భగత్‌సింగ్ యువతకు స్ఫూర్తి దాయకమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు అన్నారు. ఎచ్చెర్ల మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి సభ శనివారం నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

రణస్థలంలో..

రణస్థలం: భగత్‌సింగ్ జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతిని పైడిభీమవరంలో శ్యాంపిస్టన్స్ పరిశ్రమ వద్ద శనివారం నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్మికులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

24 నుంచి మార్వాడీల హోలీ వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్: హోలీ పండుగ వేడుకలను ఈనెల 24, 25 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు రాజస్థాన్ మిలాన్ మంచ్ ప్రతినిధులు రాజేంద్ర కర్నాని తెలిపారు. ఎంతో ఉత్సాహంగా ప్రతిష్ఠ హోలీని జరుపుకోడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

నగరంలో వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న అరసవల్లి మిల్లు కూడలి వద్ద వాహన తనిఖీలు పోలీసులు శనివారం జరిపారు. ఎస్సై గణేష్ ఆధ్వర్యంలో సిబ్బంది అనుమానితంగా ఉండే కార్లు, వ్యాన్లను ఆపి లోపల ఉండే బ్యాగులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గంజాయి, మద్యం, లెక్కలేని నగదు అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

సంజీవరాయ స్వామికి విరాళాలు

శ్రీకాకుళం కల్చరల్: బొందిలీపురం వద్దగల బాయమ్మతోటలో సఖియామఠం నిర్వహణలో ఉన్న సంజీవరాయ స్వామికి పలువురు విరాళాలను అందచేశారని విశ్వజయం గ్రూపు ప్రతినిధి కాశిని వేంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. బోయిన విజయకుమార్, రోజారాణి దంపతులు రూ.20 వేలు, వాళ్ల విజయకుమార్, ఉషా దంపతులు రూ.10 వేలు విరాళంగా అందించారు. అర్చకులు ఇ.వి.ప్రశాంత శర్మ, ఆలయ ధర్మకర్త పూర్ణచంద్రదాస్, ఉప్పు త్రినాథరావు, బోయిన ఉషా, బోయిన ఆకాష్ పాల్గొన్నారు.

మౌలిక వసతులపై ఆరా



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్సై గణేష్

శ్రీకాకుళం క్రైమ్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగరంలోని ఎచ్చెర్ల వీధి పోలింగ్ కేంద్రాన్ని ఒకటో పట్టణ ఎస్సై బలివాడ గణేష్ పరిశీలించారు. ఎస్పీ రాధిక ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రంలోని మౌలిక వసతులు, భౌగోళిక పరిస్థితులు, కేంద్రం నుంచి బయటకు పోయే మార్గం తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా అంతా సమన్వయంగా విధులు నిర్వహించాలని సూచించారు.

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు గూనపాలెం సెక్టారు సూపర్‌వైజర్ బి.యోగీశ్వరి అన్నారు. గూనపాలెం చెరువుగట్టు వద్ద శనివారం పోషణ-పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం చిన్నారుల బరువును తూయించి బరువులను నమోదు చేయించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కె.కల్యాణి, సుజాత, ఆదిలక్ష్మి, డి.ఇందుమతి, పి.పార్వతి, వై.లీలారత్నం, పి.రత్నలక్ష్మి, వి.జయలక్ష్మి, ఎస్.కె.భారతి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

‘లక్ష్మీదేవికే టీడీపీ టికెట్ కేటాయించాలి’



మాట్లాడుతున్న అప్పలసూర్యనారాయణ

శ్రీకాకుళం: శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ టికెట్‌ను మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి గుండ లక్ష్మీదేవికే కేటాయించాలని, అధిష్టానం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆ పార్టీకి చెందిన పలువురు కోరారు. అరసవల్లిలోని గుండ లక్ష్మీదేవి నివాసంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. పార్టీ ఇన్‌చార్జిని సంప్రదించకుండా, సీనియర్ నేత, మాజీ మంత్రి అప్పలసూర్యనారాయణకు చెప్పకుండా టిక్కెట్‌ను ఏకపక్షంగా ప్రకటించడం ఆక్షేపణీయమన్నారు. టిక్కెట్ ప్రకటన నుంచి నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. ఇన్నాళ్లుగా క్రమశిక్షణకు కట్టుబడి పార్టీ కార్యక్రమాలను నిర్వహించిన లక్ష్మీదేవికి టిక్కెట్ ఇవ్వకపోవడంతోనే ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు. కార్యకర్తల నిర్ణయమే లక్ష్మీదేవి నిర్ణయమని, అధిష్టానం నిర్ణయం మార్చుకోకుంటే ఇండిపెండెంట్‌గా నిలబెట్టి గెలిపించుకుంటామన్నారు. కొందరు ఏజెంట్లు ఇచ్చిన తప్పుడు నిర్ణయాలతోనే నియోజకవర్గంలో టీడీపీ ఈ పరిస్థితి వచ్చిందన్నారు. సమావేశంలో ముద్దాడ కృష్ణమూర్తినాయుడు, మాదారాపు వెంకటేష్, కొర్ను నాగార్జున ప్రతాప్, జామి భీమశంకర్, సింతు సుధాకర్, జల్లు రాజీవ్, తోనంగి వెంకన్న యాదవ్, బుక్కా యుగంధర్, ఉంగటి వెంకటరమణ, కరగాన భాస్కర్ ఉన్నారు.

‘నామినేటెడ్ పదవులు మాకొద్దు’

తమకు నామినేటెడ్, ఎమ్మెల్సీ పదవులు వద్దని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ అన్నారు. తన స్వగృహంలో మాట్లాడుతూ.. ప్రజలు, కార్యకర్తల అజెండాయే తమ అజెండా అన్నారు. తమకు ఏనాడు వ్యక్తిగత ఎజెండా లేదని స్పష్టం చేశారు.

పార్టీ ప్రతిపక్షంలో ఉండి కష్టకాలంలో ఉన్నప్పుడు లక్ష్మీదేవి వెంట ఉన్న గ్రూపు క్రమశిక్షణతో పనిచేశారన్నారు. రెండేళ్ల క్రితం నుంచి పార్టీ క్రమశిక్షణ తప్పిందన్నారు. పార్టీలో అసమ్మతిని రేపిన వ్యక్తికి టికెట్ ఇవ్వడం సరికాదని వ్యాఖ్యానించారు. పార్టీలో వర్గపోరుపై పలుమార్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడుకు దృష్టికి తీసుకెళ్లానని, అయినా పరిస్థితిని చక్కదిద్దలేదన్నారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయవ్యాదులు కూడా వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జిల్లా ప్రాసెక్యూషన్ డీడీ, ఎస్సీ, ఎస్టీ కోర్టు పీపీ మెట్ట మల్లేశ్వరరావు అన్నారు. న్యాయవ్యవస్థలో ప్రాసెక్యూసన్ అంతర్భాగమని చెప్పారు. జిల్లా కోర్టు ఆవరణలోని కార్యాలయంలో పీపీలు, అదనపు పీపీలతో నెలవారీ ప్రాసెక్యూషన్ సమీక్షను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీపీలు ఎప్పటికప్పుడు ఉన్నత న్యాయస్థానాల తీర్పులు చదవాలని, వాటిలో వచ్చిన మార్పులు, ఇతర అంశాలను పరిశీలించాలని సూచించారు. మారుతున్న కాలంతో పాటుగా వృత్తిలో మనం కూడా సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలన్నారు. రానున్న కొత్త చట్టాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫ్యామిలీ కోర్టు పీపీ వాన కృష్ణచంద్, లోలుగు వెంకటరమణ, చింతాడ సత్యనారాయణ ఉన్నారు.

శ్రీకాకుళంలో ఫ్లాగ్ మార్చ్



ఫ్లాగ్ మార్చ్‌లో కేంద్ర బలగాలు

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని ఒకటో పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో శనివారం రాత్రి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎస్సై బలివాడ గణేష్ ఆధ్వర్యం 30 మంది సిబ్బంది గూనపాలెం, సబ్ డివిజ్ పోలీసు కార్యాలయం నుంచి మండల వీధి, మహాలక్ష్మీనగర్ వీధుల్లో ఫ్లాగ్ మార్చ్ చేశారు.

మ్యాథ్స్ లెక్చరర్ రవిశంకర్‌కు డాక్టరేట్



రవిశంకర్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సురేఖ

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో మ్యాథ్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న రోణంకి రవిశంకర్ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. విశాఖపట్నంలోని గీతం యూనివర్సిటీ నుంచి ఆయన పీహెచ్‌డీ పూర్తిచేశారు. ‘పాసివిటీ ఆఫ్ మయ్యర్ ఆర్డర్ బౌండ్రీ వాల్యూ ప్రోబ్లమ్స్ విత్ పి-లాప్లేసియన్ ఆపరేటర్’ అనే అంశంపై నంబూరి శ్రీధర్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పరిశోధన పూర్తిచేసి, గీతం యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ గుణశేఖర్ నుంచి రోణంకి రవిశంకర్ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. శనివారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ ఎంవీ సత్యన్నారాయణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రోణంకి హరిత, అధ్యాపకులు రవిశంకర్‌ను అభినందించారు.

ఆలయాల్లో శనిత్రయోదశి పూజలు



నక్కవీధిలోని శనీశ్వరునికి అభిషేకాలు చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు ఆలయాలలో ఉన్న నవగ్రహాల వద్ద శనీశ్వరునికి ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు శనివారం జరిగాయి. పలువురు దోషపరిహారం, అర్ధాష్టమ శని దోష పరిహారం కోసం నువ్వుల నూనెతో శనికి అభిషేకాలు చేశారు. నక్కవీధిలోని ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలోని శనీశ్వరునికి భక్తులు అభిషేకాలు పూజలు నిర్వహించారు.గుడివీధిలోని ఉమారుద్రకోటేశ్వరస్వామి దేవాలయంలో, కొన్నావీధి భీమేశ్వరాలయంలో శనిశ్వర్వుడికి పూజలు చేశారు.

వాహనాలకు అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న ఆర్వో లక్ష్మణమూర్తి

రణస్థలం: రాజకీయ ప్రచారానికి వినియోగిస్తున్న వాహనాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎచ్చెర్ల నియోజకవర్గ ఆర్వో లక్ష్మణమూర్తి తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎచ్చెర్ల నియోజకవర్గ స్థాయిలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో వినియోగించే ప్రతీ వాహనానికి అనుమతి ఉండాల్సిందేనని, వాహనానికి మరో ప్రచార వాహనానికి కనీసం వంద మీటర్లు దూరం ఉండాలన్నారు. వాహనాలను రవాణా శాఖకు సంబంధించిన ప్రతీ పత్రం కచ్చితంగా ఉండాలన్నారు. ప్రచార పత్రాలకు సంబంధించిన ముద్రణ రసీదులు ఉండాలన్నారు. వాహన అనుమతులు లేకుండా స్పీకర్లు, జెండాలు కడితే సీజ్ చేస్తామన్నారు. ఈ సమావేశంలో నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం



ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న మాజీ ఎంపీపీ గొర్లె పరిమళ

రణస్థలం: ప్రజాసంక్షేమం కోసం నిరంతరం పాటుపడే మంచి మనసున్న వ్యక్తి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సతీమణి, రణస్థలం మాజీ ఎంపీపీ గొర్లె పరిమళ అన్నారు. రణస్థలం పంచాయతీలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అభయాంజేయ స్వామి ఆలయంలో పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌ను మరోసారి గెలిపించాలని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. యువత, మహిళలు, పార్టీ నాయకులు భారీగా పాల్గొన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, మండల మహిళా అధ్యక్షురాలు గురాన మానస, కార్పొరేషన్ డైరెక్టర్ చిల్ల వర్షిణిని రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యురాలు సింక గౌరి, గ్రామ నాయకులు పిన్నింటి లక్ష్మునాయుడు, కరిమజ్జి భాస్కరరావు, మహంతి గురునాయుడు, జోగినాయుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణ



ప్రభుత్వ సంస్థలో నిర్మాణం



నిర్మాణాలు ఆపాలని సూచిస్తున్న రెవెన్యూ, పోలీస్ సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్ఎంపురం ఏపీ గురుకుల పాఠశాలకు కేటాయించిన ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైంది. పాఠశాల యాజమాన్యం ఫిర్యాదు మేరకు అధికారులు అక్రమ నిర్మాణాలను అడ్డుకున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆక్రమణలు అడ్డుకుంటూ నిరంతరం స్థలాన్ని పరిశీలిస్తున్నారు. మళ్లీ అక్రమ నిర్మాణానికి ఆక్రమణదారుడు పాల్పడటంతో మరి కొందరు పక్క స్థలాలను ఆక్రమించుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది శనివారం అక్రమ నిర్మాణాలను అడ్డుకున్నారు. పూర్తిస్థాయిలో స్థల సర్వే చేయనున్నట్లు తహసీల్దార్ వి.శ్యాంకుమార్ తెలిపారు.

నీటి సమస్యను పరిష్కరించాలి



బోరు నుంచి బురద నీరు వస్తున్న దృశ్యం

గార: గొంటి పంచాయతీలో కొన్ని రోజులుగా మంచినీటి సమస్య ఉందని గ్రామస్తులు తెలిపారు. పరిష్కారానికి అధికారులు, ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది చొరవ చూపాలని కోరుతున్నారు. వాస్తవానికి శాలిహుండం రక్షిత పథకం నుంచి నీరు రావాల్సి ఉంది. అయితే వేసవితోపాటు శివారు పంచాయతీ కావడంతో పంచాయతీలోని నీటి ట్యాంకులకు నీటి సరఫరా కావడం లేదు. సమస్య పరిష్కారానికి గతంలో సుంకరిపాలెం వద్ద బోర్లు వేసినా బురద నీరు రావడంతో సరఫరాను నిలిపివేశారు. సమస్యను సర్పంచ్ చల్ల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ శిమ్మ ధర్మరాజు, ఎంపీటీసీ సభ్యుడు కోట రామారావులు మంత్రి ధర్మాన ప్రసాదరావు దృష్టికి తీసుకెళ్లగా నెల రోజుల కిందట రూ. 5 లక్షలు మంజూరు చేశారు. అలాగే గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 3.5 లక్షలు కేటాయించారు. అయితే అధికారులు చొరవ చూపకపోవడంతో పనులు జరగలేదు. దీంతో మంచినీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు.